# గ్రీవెన్స్ జిల్లా కమిటీ ఏర్పాటు


కలెక్టర్ భారతి హోలీకేరీ..

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 21 : ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదును విడుదల చేయడానికి జిల్లా ఎన్నికల కార్యాలయంలో గ్రీవెన్స్ జిలా కమిటీని కలెక్టర్ భారతిహోలీకేరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్‌గా జడ్పీ సీఈఓ దిలీప్ కుమార్‌ను నియమించినట్లు ఆమె తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50వేలకు మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న లేదా రవాణా చేస్తున్న నగదును సీజ్ చేస్తారన్నారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించిన సదరు వ్యక్తులు పూర్తి వివరాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించాలన్నారు. కమిటీ పరిశీలించి సరైన ఆధారాలు ఉంటే సీజ్‌చేసిన నగదును తిరిగి ఇస్తారని తెలిపారు. నగదు సీజ్‌కు గురైన వారు పూర్తి ఆధారాలతో జిల్లా గ్రీవెన్స్ కమిటీని సంప్రదించాలని కోరారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో పోలీసులు, ఫ్లయింగ్‌స్క్వాడ్ తనిఖీల్లో 175మంది నుంచి రూ.7.97కోట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. అందులో 77కేసులకు అప్పీల్ చేసుకోగా 34కేసులు పరిష్కరించి రూ.1.25కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. రూ.10లక్షలకు పైగా ఉన్న కేసులను ఇన్‌కమ్ ట్యాక్స్ వారికి అప్పగించామని తెలిపారు. మిగిలిన వ్యక్తులు తమ నగదుకు సంబంధించి సరైన ఆధారాలు రంగారెడ్డి జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ కమిటీలో సమర్పించి తమ నగదును విడుదల చేసుకోవాలని సూచించారు. గ్రీవెన్స్ కమిటీ జిల్లా అధికారి దిలీప్‌కుమార్ సెల్‌ఫోన్ 7673916600 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# అక్రమ రవాణాపై దృష్టి సారించాలి

- సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లలో సీసీ టీవీలు ఏర్పాటు చేయాలి
- వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి
- పోలీస్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 21 : జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న డబ్బు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ల పరిధిలో సీసీ టీవీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలకు ఎన్నికలు జరిగే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లను ముందుగానే బైండోవర్ చేయాలని సూచించారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు కచ్చితంగా అనుమతి తీసుకునేలా చూడాలని తెలిపారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే అధికారులతో కలిసి పని చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ అధికారులు ప్రతి గంటకోసారి చెక్‌పోస్ట్ అధికారులతో మాట్లాడి వారి సమాచారం తెలుసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్సులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే ప్రతి విషయంపై అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, డీఎస్పీలు నర్సింహులు, కరుణాసాగర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, జిల్లా వర్టికల్ డీఎస్పీ జానయ్య, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన పోలీసులు

## తాండూరులో బీఆర్ఎస్ గెలుపు ఖాయం


మాట్లాడుతున్న విఠల్‌నాయక్

తాండూరు, అక్టోబర్ 21: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బంజారా సంఘం రాష్ట్ర నాయకుడు, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్ అన్నారు. హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్, తాండూరులో రెండోసారి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తారన్నారు. తాండూరులో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ తొమ్మిదేండ్లలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులు చేసిందన్నారు. రూ.1648.12 కోట్ల సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినట్లు తెలిపారు. తాండూరు పట్టణ అభివృద్ధి పనులకు రూ.1191.86 కోట్లు, తాండూరు మండలంలో రూ.236.14 కోట్లు, యాలాల మండలంలో 97.77 కోట్లు, బషీరాబాద్ మండలంలో 68.18 కోట్లు, పెద్దేముల్‌లో రూ.78.54 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు.

## సమాజ శ్రేయస్సే ఊపిరిగా..

ఆమనగల్లు, అక్టోబర్ 21 : సమాజ శ్రేయస్సే ఊపిరిగా ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టిన పోలీసు అమర వీరుల త్యాగం వెలకట్టలేనిదని ఎస్సై బలరాం అన్నారు. శనివారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆవరణలోని పోలీస్ అమరుడు కాసం హన్మంత్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులు అమర వీరుల త్యాగాలను మరువద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై బాల్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## పండుగకు 11 ప్రత్యేక రైళ్లు

**27 వరకు రాకపోకలు**

సిటీబ్యూరో, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): దసరా పండుగ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 11 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తూ రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 21 నుంచి 27 వరకు దసరా ప్రత్యేక రైళ్ల రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. 'బెంగుళూరు – సంత్రగాచి, చెన్నై–భువనేశ్వర్, చెన్నై – సంత్రగాచి, బెంగుళూర్ – భువనేశ్వర్, నాందేడ్ – పానిపట్, ఎర్నాకులం – ధన్‌బాద్' వంటి పలు రైల్వే స్టేషన్ల మధ్య దసరా ప్రత్యేక రైళ్లు నడుస్తాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కొండాపూర్, అక్టోబర్ 21: లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం, చందానగర్ గాంధీ విగ్రహం సమీపంలోని ముంబై జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తలతో పాటు శరీర భాగాలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభించలేదని తెలిపారు.

# అనంతపద్మనాభస్వామికి ప్రత్యేక పూజలు


సింహ వాహనంపై ఊరేగుతున్న అనంతపద్మనాభస్వామి

వికారాబాద్, అక్టోబర్ 21 : దసరా ఉత్సవాల సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లిలోని అనంతపద్మనాభ స్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనంతపద్మనాభస్వామి వారు సింహ వాహనంపై ఊరేగారు. భక్తులు స్వామివారి పల్లకీని ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి పద్మనాభం, ఈవో నరేందర్ పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు బాగున్నాయ్


సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది అంజయ్య

వికారాబాద్, అక్టోబర్ 21 : ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అద్భుతంగా ఉన్నాయని వికారాబాద్ బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది అంజయ్య అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని క్లబ్ ఫంక్షన్‌హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విలువలను పాటించడం లేదని, ఎంతో కాలంగా పార్టీ జెండా మోసిన వారిని కాదని ఇతరులను ప్రోత్సహిస్తున్నారన్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. దసరా తరువాత ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, విజయ్‌కుమార్, శేఖర్, బాలయ్య, కృష్ణ, నాగేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కుక్కపిల్ల ఇస్తామని 30 వేలు మోసం

వెంగళరావునగర్, అక్టోబర్ 21 : మూగజీవి పట్ల ఉన్న మమకారమే ఆ యువతి మోసపోవడానికి కారణమైంది. ఓ కుక్క పిల్లకు జబ్బున్న విషయాన్ని దాచి అధిక ధరకు అమ్మేసి కుట్రకు పాల్పడ్డారు ఓ కెన్నెల్ నిర్వాహకులు. మరో కుక్క పిల్లని ఇస్తామని కాలం వెళ్లబుచ్చి.. 'చివరకు డబ్బు ఇవ్వం.. కుక్క పిల్లని ఇవ్వం.. దిక్కున్న చోట చెప్పుకో' అంటూ బెదిరించారు. మోసపోయానని గ్రహించిన బాధిత యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం మేరకు.. ఎల్లారెడ్డిగూడ జయప్రకాశ్ నగర్‌కు చెందిన డి.ప్రసన్న లక్ష్మి యూట్యూబ్‌లో డీఎస్ కెన్నెల్‌కు సంబంధించి షిహ్ త్జు జాతికి చెందిన కుక్కపిల్ల విక్రయ ప్రకటన చూసి ఆకర్షితురాలైంది. బండ్లగూడ కాళిమందిర్ సమీపంలోని డీఎస్ కెన్నెల్ పెట్ షాపు నిర్వాహకులను ఫోన్‌లో సంప్రదించారు. షిహ్ త్జు జాతికి చెందిన బుజ్జి కుక్క పిల్లని గత జూన్ 1వ తేదీన రూ.30వేలకు ఆమె కొనుగోలు చేశారు. అయితే కుక్క పిల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుందని నిర్వాహకులను అడిగారు. అయితే జలుబు చేసిందని, కుక్కపిల్ల ఆరోగ్యంగానే ఉందని నిర్వాహకులు ఆమెకు చెప్పారు. వెటర్నరీ డాక్టర్‌ను సంప్రదించగా.. కుక్కపిల్లకు లంగ్స్‌లో ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో తీసుకున్న మూడు గంటల్లోనే కుక్కపిల్లను తిరిగి ఇచ్చేశారు. అనారోగ్యంతో ఉన్న ఆ కుక్కపిల్లను అమ్మడంపై షాపు నిర్వాహకుల్ని ఆమె ప్రశ్నించగా.. మరో కుక్క పిల్లని ఇస్తామంటూ కాలం వెళ్లబుచ్చారు. తన డబ్బు తనకు ఇవ్వాలని కోరగా.. పెట్ దుకాణం నిర్వాహకులు వాసు, సాయిలు దురుసుగా ప్రవర్తించి.. అసభ్య పదజాలంతో దూషించారు. దాంతో తాను మోసపోయానని గ్రహించిన ఆ బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవు

**ఆమనగల్లు సర్కిల్ పరిధిలో 32 కేసులు నమోదు**


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ బద్యానాథ్

ఆమనగల్లు, అక్టోబర్ 21 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శనివారం విస్తృత దాడులు నిర్వహించి రూ. 3 లక్షల పైగా విలువైన కల్తీ కల్లు, నాటుసారా, అక్రమ మద్యం, బెల్లం పానకం, బీర్లతో పాటు ఒక వాహనాన్ని సీజ్ చేసి 32 కేసులు నమోదు చేశామని తెలిపారు. శనివారం రాత్రి ఆయన వివరాలను వెల్లడించారు. 500 లీటర్ల కల్తీ కల్లు, 14 లీటర్ల నాటుసారా, 24.55 లీటర్ల అక్రమ మద్యం, 60 బీర్లను సీజ్ చేశామన్నారు. 1950 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామని తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఒక స్కూటీ వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఎక్సైజ్ శాఖ తనిఖీల్లో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్ట పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామని తెలిపారు. మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లిలో శంకర్ జీ అక్రమంగా నిల్వ ఉంచిన 10 ఓసీ బాటిళ్లు, 10 ఐబీ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఇర్విన్ గ్రామంలో ఓ షెడ్డు వద్ద 10 ఓసీ బాటిళ్లు, 10 ఐబీ బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నామని వెల్లడించారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

కోట్‌పల్లి, అక్టోబర్ 21 : ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలని కోట్‌పల్లి ఎస్సై అంబాదాస్ అన్నారు. శనివారం మండలంలోని లింగంపల్లి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. మద్యం, నగదుపై ప్రత్యేక నిఘాను పెట్టామన్నారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. ఆ డబ్బుకు సంబంధించి ఆధారాలను చూయించాలని సూచించారు.